'గేట్' కష్టాలు తీరేదెన్నడో..

ఖమ్మంలో మూతబడిన మధ్య రైల్వే గేటు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, ప్రజలు
- పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయం చూపాలని విన్నపాలు


మూసి ఉన్న రైల్వే గేటు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని ప్రధానమైన వ్యాపార వాణిజ్య కేంద్రాలుగా ఉన్న రెండు ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నిర్మించిన రైల్వే మధ్య గేటు రెండు నెలలుగా మూతబడింది. గాంధీచౌక్-కమాన్‌బజార్ ప్రాంతాలను అనుసంధానం చేసే ఈ గేటు మూతపడడంతో వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థల్లో, దుకాణాల్లో పనులు చేసేందుకు కూలీలు గేటు దాటి వెళ్తుంటారు. ప్రస్తుతం గేటు మూసి ఉంచడం, పనులు చేస్తుండడంతో నడిచి వెళ్లేందుకు కూడా వీలు లేకుండాపోయింది. ఎప్పటి నుంచో అండర్ రైల్వే బ్రిడ్జిని నిర్మించాలని ప్రజలు కోరుతున్నా రైల్వే అధికారులు, పాలకులు పట్టించుకోలేదని, ఇప్పుడు అభివృద్ధి పనుల పేరుతో గేట్‌బంద్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ గేటుకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు.

వేలాది మంది రాకపోకలు..

గాంధీచౌక్-కమాజన్‌బజార్ ప్రాంతాలను అనుసంధానించే మధ్య గేటుకు ప్రాధాన్యత ఉంది. ఈ గేటు ద్వారా వ్యాపారుల సరుకులను రెండువైపులా తరలించడంతో పాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధికి వెళ్లే వారంతా ఈ గేటు ద్వారానే వెళ్తుంటారు. పంపింగ్‌వెల్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, గాంధీనగర్, గాంధీచౌక్ ప్రాంతాల నుండి కమాన్ బజార్‌కు, పాత బస్టాండ్, వైరారోడ్డు, కస్బాబజార్, కమాన్‌బజార్ ఇతర ప్రాంతాల నుండి గాంధీచౌక్‌కు ఈ గేటు మీదుగా రాకపోకలు సాగిస్తారు. అలా కాకుండా చర్చికాంపౌండ్, మయూరిసెంటర్ ఆర్‌ఓబీలపై నుండి తిరిగి రావాలంటే దూరంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు, కార్మికులు, వినియోగదారులంతా ఈ గేట్ ద్వారానే వెళ్లివస్తారు. అయితే, ఈ గేటు మూసిన నాటి నుండి అంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏళ్ల తరబడి ఎదురుచూపులు..

ప్రస్తుతం ఉన్న మధ్య గేటు ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించాలని దశాబ్దాల కాలం నుండి స్థానికులతో పాటు ఈ ప్రాంతాల్లో పనుల కోసం వచ్చే వారు పాలకులను కోరుతున్నారు. అయినా ఇక్కడ ఆర్‌యూబీ నిర్మించేందుకు ఇప్పటి వరకు అడుగులు పడలేదు. ఇక రైల్వే మూడో లైన్ నిర్మాణం పనులు జరుగుతుండడంతో ఆర్‌యూబీ ఆశలు కూడా పోయాయని వాపోతున్నారు. ఇక చిన్నపాటి ఆర్‌ఓబీ నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని, గేటుతో భవిష్యత్‌లోనూ ఇబ్బందులు తప్పవని, ఇప్పటికైనా ఆర్‌ఓబీ నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇక పలు పార్టీలు, ప్రజా సంఘాలు, వ్యాపారులు ఆర్‌ఓబీ నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా మధ్య గేటు మూసి ఉంచడంపై రైల్వే అధికారులను వివరణ కోరగా.. ఖమ్మం నుండి పందిళ్లపల్లి వరకు మూడవ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గేటు మూసి ఉంచామని, మరో మూడు నాలుగు రోజుల్లో గేటును తెరిచి, రాకపోకలకు అనుమతులు ఇస్తామని తెలిపారు.

ఉద్యమాలకు కార్యాచరణ..

రైల్వే గేటుకు ప్రత్యామ్నాయంగా ఆర్‌ఓబీ నిర్మించాలనే డిమాండ్ రోజురోజుకు పెరుగుతుంది. ఖమ్మం గాంధీచౌక్‌లో ఓ హోటల్‌లో సోమవారం గుండాల కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఓబీనిర్మించాలని, దానితోనే ఈ ప్రాంత అభివృద్ధితో పాటు స్థానికుల కష్టాలు తొలగుతాయని సమావేశంలో పేర్కొన్నారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, రేణుకాచౌదరి ఇతర నేతలను కలిసి వినతులు ఇవ్వాలని నిర్ణయించారు.

రైల్వే అధికారులకు వినతి



ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ప్రధాన వ్యాపార, వాణిజ్య ప్రాంతాలైన గాంధీచౌక్-కమాన్ బజార్‌లను అనుసంధానం చేసే మధ్య గేటు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని త్రీటౌన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ గుండాల కృష్ణ, అధ్యక్షుడు సన్నే ఉదయ్ ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు త్రీటౌన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వ్యాపారులు, నాయకులు పాదయాత్రగా ప్రదర్శన నిర్వహించి అనంతరం రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రెండు నెలలుగా మధ్య గేటు మూసి ఉంచడంతో వ్యాపారాలన్నీ కుదేలైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, నాయకులు యర్రా శ్రీకాంత్, యర్రా శ్రీను, నూనె శశిధర్, వ్యాపారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీసీని సస్పెండ్ చేయాలని ఆందోళన


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఇటికాల రామకృష్ణ, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద సురేష్, మస్తాన్ డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన విద్యార్థులతో కలిసి ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా చేశాక అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బకాయిలు చెల్లించలేదని పలు డిగ్రీ కళాశాలల ఫలితాలు వెల్లడించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివనాయక్, వంశీ, అజయ్, ఇందు, వర్ష, టీబీ.విలాషా పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పి.రాములు అనారోగ్యానికి గురికావటంతో ఆయన్ను ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగళి శ్రీపాల్‌రెడ్డి మంగళవారం నగరంలోని రాములు నివాసానికి వెళ్లి పరామర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, నాయకులు మోత్కూరు మధు, శ్రీనివాసరావు, కట్టా శేఖర్, లింగం సతీష్, రాయల నరసింహారావు, మండ ప్రధాన కార్యదర్శి వెంకన్న, అనిత, శ్రీ వర్ష, రాజు, రత్నకుమార్ ఉన్నారు.

నిల్వ మిర్చిపై 'రైతుబంధు' రుణం

ఖమ్మంవ్యవసాయం: రైతుబంధు పథకం ద్వారా ఐదుగురు మిర్చి రైతులకు పంట నిల్వ ఆధారంగా మంగళవారం రూ.10 లక్షల రుణాలు అందజేశారు. మిర్చికి సరైన ధర లేని నేపథ్యాన ఐదుగురు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి బాండ్లను మార్కెట్ కమిటీకి సమర్పించగా రూ.2లక్షల చొప్పున రుణాలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, డైరెక్టర్లు బోజడ్ల సత్యనారాయణ, వెలిగండ్ల బాబూరావు, లతీఫ్, రమేష్ పాల్గొన్నారు.

ఈ-ఫైలింగ్‌లో సమస్యలు పరిష్కరించండి

ఖమ్మం లీగల్: ఈ-ఫైలింగ్ సర్వీసెస్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఖమ్మంకు చెందిన న్యాయవాది తాళ్లూరి దిలీప్ కోరారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆఫ్ ఐటీ కమ్ సెంట్రల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కుమార్‌కు ఆయన మంగళవారం వినతిపత్రం అందజేశారు. సివిల్ కేసు నంబర్ అయ్యాక స్కాన్ చేస్తే న్యాయవాదులకు సులువుగా ఉంటుందని పేర్కొన్న ఆయన ఈ-ఫైలింగ్ విధానంపై అవగాహన తరగతులు ఏర్పాటుచేయాలని కోరారు.

ప్రైవేట్‌కు దీటుగా బోధన

నేలకొండపల్లి: కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతుందని అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి (ఏయంఓ) రవికుమార్ అన్నారు. మండలంలోని అమ్మగూడెం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చలపతిరావు, హెచ్‌ఎం టి.వెంగళరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణారావు, మాజీ సర్పంచ్ గండు సతీష్, సంఘాల ప్రతినిధులు టి.గోవిందరావు, మారగాని సత్యనారాయణ, సొసైటీ ఉపాధ్యక్షుడు అడపాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 25న మహబూబ్‌నగర్‌లో జరిగే టీయూసీఐ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని, ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోసు పుల్లయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మంలో మహాసభల పోస్టర్లను పాతబస్టాండ్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవన నిర్మాణంతోపాటు ఇతర నిర్మాణ కార్మికులు దేశంలోనూ రాష్ట్రంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్, టీయూసీఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదంపై సంబురాలు..


ఖమ్మంవన్‌టౌన్: సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


కూసుమంచిలో..


కామేపల్లిలో..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడంపై ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఘనంగా సంబురాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, హుస్సేన్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రాపర్తి శరత్, వెంకటనారాయణ, లక్ష్మీ, గజ్జెల్లి వెంకన్న, సూర్యనారాయణ, బాణాల లక్ష్మణ్, ఏలూరి రవికుమార్, సాయి, క్రాంతి, రమేష్, ప్రవీణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: బీసీల 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ బిల్లు ఆమోదించటంపై మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

కామేపల్లి: మండలంలోని పండితాపురంలో కాంగ్రెస్, బీసీ సంఘాల నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, నాయకులు మేకపోతుల మహేష్‌గౌడ్, శీలం పుల్లయ్య, బత్తుల వీరబాబు, ఉపేందర్, తిరుపయ్య, వెంకయ్య ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీను అన్నారు. ఈ నెల 24న మండల కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చెయ్యాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, బింగి రమేష్, ఉపేందర్, వెంకన్న, వీరన్న, బండారి సైదులు, రమేష్, దిండు మంగపతి, మహేందర్, లింగస్వామి ఉన్నారు.

చిన్నారికి దొరికిన ఫోన్ అప్పగింత

నేలకొండపల్లి: మండలకేంద్రంలో ఓ చిన్నారికి ఫోన్ దొరకడంతో పోలీసుల సమక్షంలో మంగళవారం బాధితురాలికి అప్పగించారు. మండలకేంద్రానికి చెందిన టి.అయోధ్యమణి మండలకేంద్రంలో ఫోన్ పడిపోగా కొత్తకొత్తూరులోని పాఠశాలకు వెళ్తున్న కోటి ధనుష్‌కు ఫోన్ దొరకడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. అనంతరం బాధితులరాలికి సమాచారం అందించి ఫోన్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా ధనుష్‌ను పోలీసులు అభినందించారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 6గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఇఫ్తార్ విందులో పాల్గొననున్న ఆయన, ఆతర్వాత ఖమ్మంరూరల్ మండలం మంగలగూడెంలో ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవుతారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు


సుధాకర్‌రెడ్డితో కోటేశ్వరావు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నెల్లూరి కోటేశ్వరరావు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కోఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ మరింత బలపడేలా తీసుకోవాల్సిన చర్యలపై పొంగులేటి సూచనలు చేశారు. త్వరలోనే నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు కోటేశ్వరరావు తెలిపారు.

వితరణ..

ఖమ్మంఅర్బన్: నగరం 14వ డివిజన్ గొల్లగూడెంలో ఓం శ్రీకృష్ణ గోశాలకు ఖమ్మంకు చెందిన మహేశ్వరం జ్యూవలరీ తరఫున కృష్ణప్రసాద్ మంగళవారం పశుగ్రాసాన్ని వితరణగా అందించినట్లు గోశాల నిర్వహణ బాధ్యులు కేసా హనుమంతురావు తెలిపారు. దాతలు స్పందించి గ్రాసం కోసం చేయూత అందించాలని కోరారు.

రైతుల గోసను పట్టించుకోని పాలకులు

నేలకొండపల్లి: రైతుల గోసను పాలకులు పట్టించుకోవటం లేదని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవన్ లో మంగళవారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీతారాములు, కార్యదర్శిగా పాల్తీయ శ్రీనివాసరావులతో పాటు మొత్తం 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, నాయకులు వెంకటరెడ్డి, కర్నాటి భానుప్రసాద్, రామకోటి, భిక్షం, చిర్రా ప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నారాయణ, కృష్ణ, రాములు, కృష్ణంరాజు, రేణుబాబు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



రఘునాథపాలెం: మాట్లాడుతున్న హనుమంతరావు


తిరుమలాయపాలెంలో..

రఘునాథపాలెం: పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం బి. శ్రీమన్నారాయణ, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ యరగర్ల గౌరమ్మ, ఎంఈఓ రాములు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

తిరుమలాయపాలెం: చదువుని కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు సాధించవచ్చని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ అధ్యక్షులు పెసర ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు ధనమూర్తి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రఘుబాబు, కృష్ణ కళ, శోభన, గోపమ్మ, శేషఫణి, నరేందర్, శ్యామ్, హమీద్ ఉన్నారు.

నీటి సరఫరాలో సమస్యలు చెప్పండి..


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

నేలకొండపల్లి: సాగునీరు లేకుండా ఏ ఒక్క రైతు కూడ ఇబ్బంది పడొద్దని, నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే వారి దృష్టికి తీసుకురావాలని ఏడీఏ బి.సరిత సూచించారు. మండలంలోని మంగాపురంతండాలో మంగాపురం మేజర్ కాలువలను అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇంకా ఒక్క తడి నిరంతరం వస్తే పంట చేతికి వస్తుందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ యం.రాధ, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, ఏఈవో ఈశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు..


మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రమేష్

నేలకొండపల్లి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎల్.రమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు డివిజన్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నీటిని వినియోగిస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాష్, ఏఈ నరేష్, ఎంపీఓ సి.హెచ్.శివ, అధికారులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలోని పంచాయతీల్లో తాగునీటి సరఫరాపై పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్ సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మిషన్ భగీరథ అధికారులతో పాటు గ్రామ కార్యదర్శులతో ఈ సమావేశాన్ని నిర్వహించి గ్రామాల్లో తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా వేసవిలో తాగునీటి సరఫరాను సక్రమంగా అమలు చేయాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ఫోకస్..

సాక్షి ఎఫెక్ట్..


డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని విలీన గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులపై కేఎంసీ అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 17న 'సాక్షి'లో 'విలీనం.. బలహీనం' అను శీర్షికతో ప్రచురితమైన కథనానికి కేఎంసీ అధికారులు స్పందించారు. 15వ డివిజన్‌లో కొత్తగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు గ్యాంగ్ వర్క్ చేపట్టారు. విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

కేఎంసీ సమాచారం..

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నేతలతో కేఎంసీ కమిషనర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ అగస్త్య మంగళవారం కేఎంసీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఓటరు జాబిత ప్రక్రియ, ఎన్నికల అభ్యర్థుల లెక్కల వివరాలు, సాధారణ ఎన్నికల లెక్కల వివరాలు, బీఎల్ఏ నియామక ప్రక్రియ, ఫాం 7, ఫాం 8పై వివరణ తదితర అంశాలపై నేతలో చర్చించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు బృందాలు..

కేఎంసీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఎల్1 స్థాయిలో సర్వే చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డివిజన్‌కు ఒకరి చొప్పున 60 డివిజన్లకు 60 మంది సిబ్బందిని నియమించారు. వీరిపై పర్యవేక్షణ చేసేందుకు రెండు డివిజన్లకు ఒక జిల్లా అధికారిని నియమించారు. ఈ మేరకు 30 మంది జిల్లా అధికారులు కేఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షించనున్నారు.

25న కేఎంసీ బడ్జెట్ సమావేశం..

కేఎంసీ సంస్థ 2025-26 ఏడాదికి సంబంధించిన బడ్జెట్ సమావేశం ఈ నెల 25న నిర్వహించనున్నారు. 25న ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో కేఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

కమిషనర్‌ను కలిసిన నాయకులు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం రూరల్: ఏదులాపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి మంగళవారం సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువతో ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వెంపటి సురేందర్, గణపారపు వీరన్న, రాము, గడ్డా, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారబందీ ఎత్తివేయాలి

కూసుమంచి: పాలేరు పాత కాల్వకు వారబందీ విధానంలో నీటి సరఫరాను నిలిపివేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని విస్మరించారని, వెంటనే ఈ విధానాన్ని ఎత్తివేయాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కూసుమంచిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ మాట్లాడారు. నాయకులు మల్లెల సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ తనిఖీ

నేలకొండపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఖమ్మం ఆర్‌డీవో నరసింహారావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. వివిధ అంశాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుద్ధారంలోని ఓ రైతు తమ భూమి విలువను తక్కువగా చూపించారని ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్, ఆర్ఐ ఆలస్యం మధుసూదన్ రావు, సర్వేయర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్, టీఐటీయూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.విక్రమ్, జిల్లా కార్యదర్శి జె.ఉపేంద్ర కోరారు. ఈ మేరకు మంగళవారం ఖమ్మం సుందరయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... వ్యవసాయం తర్వాత ఉపాధి అవకాశాలను కల్పించటంలో ట్రాన్స్‌పోర్ట్ రంగం రెండో స్థానంలో ఉందన్నారు. రవాణా లేని సమాజం ఊహించలేమన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ట్రాన్స్‌పోర్ట్ రంగం కార్మికుల పరిస్థితి మరింత దిగజారిందన్నారు.

జిల్లా మహాసభలను..

రఘునాథపాలెం: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రవి, బాగం ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామంలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం సభ్యులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు .

ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ బిల్లును రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించినందుకుగాను మంగళవారం సమితి ఆధ్వర్యంలో ఖమ్మం జెడ్పీసెంటర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఐక్యంగా ఉన్న ఎస్సీ కులాలను రాష్ట్ర ప్రభుత్వం విడదీయాలని చూస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో చైర్మన్ పల్లా రాజశేఖర్, ఇండియన్ మాల లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెంటాల ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రకాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి మూడుసు జాకబ్ ప్రతాప్, మాల మహానాడు గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్, నాయకులు దామల సత్యనారాయణ, కొరివి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠ పూజలు


అర్ధకలశ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: 10వ డివిజన్ చైతన్యనగర్ బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్తా దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహాగణపతి హోమం, ఉష, అర్ధ సహస్ర కలశ, ఆదివాస, బ్రహ్మకలశ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మేకల హనుమంతరావు, కమిటీసభ్యులు ఉన్నారు.